సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 8 । జనవరి । 2025



మళ్లీ కలప దందా

జిల్లాలో మళ్లీ కలప దందా మొదలైంది. కొద్ది రోజులుగా స్మగ్లర్లు దట్టమైన అటవీప్రాంతంలోని టేకుచెట్లను నరికి రాత్రిపూట స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. 8లో▸



కరంజీలో పులి సంచారం

జైనథ్ మండలం కరంజి(కే)గ్రామంలో పులి సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. పంట చేలకు వెళ్లిన రైతులు పులి పాదముద్రలు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
26.0/10.0

వాతావరణం

గాలితో తేమశాతంతో పాటు రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువజామున పొగ మంచు కమ్మేయనుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల ఆందోళన



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కై లాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ అంగన్‌వాడీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్‌ మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రకళ, చాయ, సంగీత, సుశీల, రుక్మిణి, జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కాంగ్రెస్‌ నేతల పూజలు



పూజలు చేస్తున్న పార్టీ ముఖ్య నేతలు

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌ పార్టీ జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలు జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ గౌడ్‌, ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్‌ తదితరులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. వారి వెంట ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌, ఆదిలాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

ఇంటర్‌ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక



శ్రీ చరణ్‌

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీచరణ్‌ సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ క్రికెట్‌ టోర్నీకి ఎంపికైనట్లు కోచ్‌ జయేంద్ర పటాస్కర్‌ తెలిపారు. ఈ నెల 16నుంచి చెన్నై వేదికగా నిర్వహించనున్న పోటీలకు కాకతీయ యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు శ్రీచరణ్‌ను అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ కాజల్‌

ఇంద్రవెల్లి: ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని ఉట్నూర్‌ ఏఎస్పీ కాజల్‌ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారివెంట సీఐ మొగిలి, ఎస్సై సునీల్‌, సిబ్బంది ఉన్నారు.

‘సమగ్ర’ సమ్మె విరమణ

- విధుల్లో చేరిన ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు దాదాపు నెల రోజులుగా చేపట్టిన సమ్మెను మంగళవారం విరమించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించినందున సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక కలెక్టరేట్‌ వద్ద గల సమ్మె శిబిరంలో ప్రకటించారు. రోజు మాదిరిగానే శిబిరానికి వచ్చిన ఉద్యోగులు ప్రభుత్వ తీరుపై చర్చించారు. సమ్మెను విరమించాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టరేట్‌ నుంచి మండలాల వారీగా బయలుదేరి వెళ్లిన ఉద్యోగులు తమ ప్రాంతాల్లో యథావిధిగా విధుల్లో చేరారు. నెల రోజులుగా ఎమ్మార్సీల్లో స్తంభించిన కార్యకలాపాలు ప్రారంభం కానుండగా, కేజీబీవీల్లో విద్యాబోధన కొనసాగనుంది.

- కాంగ్రెస్‌లో సమసిపోని ‘పార్లమెంట్‌’ ఓటమి
- ఇప్పటి వరకు నాలుగు గోడల మధ్యే వ్యవహారం
- తాజాగా పార్టీ ‘సమీక్ష’లో ఓపెన్‌
- ఒకరిపై మరొకరు మాటల తూటాలు
- కార్యకర్తల్లో అయోమయం

కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు యథాతథం అన్నట్లుగా మారింది. పార్టీలో పార్లమెంట్‌ ఎన్నికల ఓటమితో మొదలైన మంటలు ఇంకా చల్లారినట్లు కనిపించట్లేదు. ఇప్పటి వరకు నాలుగు గోడలకే పరిమితమైన వ్యవహారం తాజాగా ఆదిలాబాద్‌లో నిర్వహించిన పార్లమెంట్‌ స్థాయి సమీక్షలో బహిర్గతమైంది. ముఖ్య నేతలు తమ ప్రసంగాల్లో ఒకరిపై మరొకరు కౌంటర్‌ ఇచ్చేలా మాటల తూటాలు పేల్చడం గమనార్హం. దీంతో సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు విస్తుపోవాల్సిన పరిస్థితి.

– సాక్షి, ఆదిలాబాద్‌



హస్తంలో విభేదాలు!

ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్‌ సమావేశంలో జిల్లా ముఖ్యనేతల ప్రసంగాలు ప్రస్తుతం ఆ పార్టీ శ్రేణుల్లో హాట్‌ టాపిక్‌గా మారాయి. ప్రధానంగా ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రసంగం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌, ఇతర అధిష్టాన పెద్దల సమక్షంలోనే బహిరంగసభ వేదికగా ఆయన పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష జరగాల్సిందేనని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొందరు అనవసరంగా తనపై అభాండాలు వేస్తున్నారని, పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రయత్నించినప్పటికీ తనపై నిందలు వేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా మీడియాకు లీకులు ఇస్తూ వార్తలు రాయిస్తున్నారని, ఇలాంటి వారి భరతం పట్టాల్సిన అవసరముందని అంటూ తీవ్ర పదజాలాన్ని ఉపయోగించారు. ఆ బాధ్యత కూడా తానే తీసుకుంటానని కార్యకర్తల సమక్షంలో అధిష్టాన పెద్దల ముందు పేర్కొనడం గమనార్హం. ఆయన ఈ మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారనేది మాత్రం నేరుగా స్పష్టం చేయలేదు. అయితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పార్లమెంట్‌ ఇన్‌చార్జి ఆత్రం సుగుణలను ఉద్దేశించి అన్నారా అనే మీమాంస కార్యకర్తల్లో వ్యక్తమవుతుంది. మొత్తంగా ఈ వ్యవహారం ప్రస్తుతం పార్టీలో దూమారం కలిగిస్తోంది.

సీతక్క మాటల తూటాలు...

ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రసంగం తర్వాత మాట్లాడిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రసంగంలో కూడా మాటల తూటాలు పేలాయి. లీడర్‌ అంటే అందరిని కలుపుకునిపోవాలని, లేకపోతే గ్రూప్‌లు తయారవుతాయని పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె ఎవరి పేరు తీసుకోకుండా మాట్లాడినా పరోక్షంగా ఎవరిని ఉద్దేశించి అన్నారో అనే దానిపై పార్టీలో జోరుగా చర్చ సాగుతోంది. అంతే కాకుండా ఇందిరమ్మ కమిటీల్లో లొల్లి ఎందుకు వస్తుందని ఆమె ప్రశ్నించడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆమెనే ఆ కమిటీలకు ఆమోద ముద్ర వేయడం గమనార్హం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోటే కాకుండా సొంత పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట కూడా ఈ కమిటీల పరంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయనే సందేహాలు కలుగుతున్నాయి.

ఎన్నికల ముందు ఏంటిలా..?

ఆదిలాబాద్‌ను ఎన్నికల సెంటిమెంట్‌గా భావించిన హస్తం పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనూ ఇక్కడి నుంచే సమీక్షలు షురూ చేయాలని అధిష్టానం భావించింది. ఈ మేరకు సోమవారం సమావేశం నిర్వహించింది. అయితే అనుకున్నదొకటి.. అయ్యింది మరోటి అన్న చర్చ పార్టీలో మొదలైంది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ సమావేశం అంతా సవ్యంగా సాగిందని పార్టీ పైకి చెబుతున్నప్పటికీ అంతర్గతంగా మాత్రం నేతల విభేదాలపై మళ్లీ చర్చ మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయం సాధించి కార్యకర్తల్లో ఉత్సాహం పెంచాలని అధిష్టానం భావించినప్పటికీ జరిగిన పరిణామాలతో అధిష్టాన పెద్దలే ఆదిలాబాద్‌ విషయంలో ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇవీ ఇక్కడికే సమసిపోతాయా.. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయా అన్న కొత్త టెన్షన్‌ మొదలైంది. అయితే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ తన ప్రసంగంలో అలకలు పక్కనపెట్టి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఇప్పటికైనా విభేదాలు వీడి పనిచేస్తారా లేదా చూడాల్సిందే.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు..

ఉట్నూర్‌రూరల్‌: సీఎం రేవంత్‌రెడ్డిని ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆసిఫాబాద్‌ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జంగుబాయి ఉత్సవాలకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే కవ్వాల్‌ టైగర్‌జోన్‌ పరిధిలో అటవీ అధికారులు చెక్‌పోస్టుల వద్ద రాత్రి 9గంటల నుంచి చిన్న వాహనాలను నిలిపి వేస్తుండంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి రాత్రి వేళలో వాహనాలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు, మాజీ ఎంపీ సోయం, మాజీ ఎమ్మెల్యే సక్కు

గవర్నర్‌ దత్తత గ్రామాల ప్రగతిపై సమీక్ష



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ రాజర్షి షా

కై లాస్‌నగర్‌: రాష్ట్ర గవర్నర్‌ దత్తత తీసుకున్న ఆదిలాబాద్‌ జిల్లాలోని గ్రామాల అభివృద్ధి పనుల ప్రగతిపై ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ దాన కిశోర్‌ మంగళవారం రాజ్‌భవన్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి కలెక్టర్‌ రాజర్షి షా ఇందులో పాల్గొన్నారు. ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని మాంగ్లీ, బుర్కి హాబిటేషన్లలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ, బుర్కిలో అంగన్‌వాడీ భవనం, కమ్యూనిటీ హాల్‌ నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా మధ్యలో ఉన్న వాగులతో నిర్మాణానికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. వాగులపై కల్వర్టులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లుగా వివరించారు. అనంతరం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్‌ ఈఈ శివరాంను కలెక్టర్‌ ఆదేశించారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



విద్యార్థితో మాట్లాడుతున్న వసంత్‌రావు

బేల: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌ జాదవ్‌ వసంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర, చంపెల్లి ఎస్టీ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సరుకుల నిల్వతో పాటు వంట గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్‌ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేయాలని హెచ్‌ఎంలు నీలకంఠ, శ్రీనివాస్‌కు సూచించారు. ఆయన వెంట వార్డెన్‌ శేష్‌రావు, ఉపాధ్యాయులు, సీఆర్టీలు తదితరులు ఉన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్‌: బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారికి ధైర్యం చెప్పేందుకే ప్యారా లీగల్‌ వలంటీర్లు పని చేస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు అన్నారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్ల రెండు రోజుల శిక్షణ సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని, అయితే అవి చాలా వరకు బయటకు రావడం లేదన్నారు. కోర్టుకు వచ్చిన కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా అవగాహన కల్పించడంతో పాటు న్యాయ సాయం అందించాలన్నారు. బాలల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్‌, హుస్సేన్‌, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్‌ వివాదం

- ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని అడ్డుకున్న కాంగ్రెస్‌ కార్యకర్తలు

నార్నూర్‌: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్‌ వివాదం తలెత్తింది. ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ నిమిత్తం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్‌ కార్యకర్తలతో కలిసి అక్కడి చేరుకున్నారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్‌ ప్రభుత్వమని, తమ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేతుల మీదుగానే చెక్కుల పంపిణీ జరగాలని ఆయనతో వచ్చిన కార్యకర్తలు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. ప్రజలతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తనకు ప్రొటోకాల్‌ వర్తిస్తుందా.. లేక ఓడిన వ్యక్తికి వర్తిస్తుందా అని ఆమె వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరు వర్గాలు నినాదాలతో హోరెత్తించగా.. సీఐ రహీంపాషా అక్కడికి చేరుకుని కార్యకర్తలను బయటకు పంపించారు. అనంతరం ప్రొటోకాల్‌ ప్రకారం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేనని చూడకుండా కాంగ్రెస్‌ నాయకులు తనను అవమానించారని ఆరోపించారు. అనంతరం నార్నూర్‌ మండలంలో 74, గాదిగూడ మండలంలో 24 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్‌ చైర్మన్‌ ఆడే సురేశ్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ జాదవ్‌ కైలాస్‌, తహసీల్దార్లు జాడి రాజలింగు, విజయనందం, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కాంగ్రెస్‌ కార్యకర్తల వాగ్వాదం

గ్రామస్థాయిలో ‘గ్రీవెన్స్‌’



కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజర్షి షా (ఫైల్‌)

- పంచాయతీలోనే ఇక అర్జీలు
- పైలట్‌ ప్రాజెక్ట్‌గా జిల్లా ఎంపిక
- నేడు జెడ్పీలో సిబ్బందికి శిక్షణ
- సంక్రాంతి తర్వాత నుంచి షురూ

కై లాస్‌నగర్‌: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా నలుమూలల నుంచి బాధితులు భారీగా తరలివచ్చి అర్జీలు అందజేస్తున్నారు. అయితే వీటిలో చాలా వరకు పరిష్కారానికి నోచుకోవడం లేదు. బాధితులు వ్యయ, ప్రయాసాలకు గురవుతున్నారే తప్ప ప్రయోజనం చేకూరడం లేదు. అలాంటి వారు హైదరాబాద్‌ ప్రజాభవన్‌లో నిర్వహించే గ్రీవెన్స్‌కు వెళ్తున్నారు. ఇది వారికి అదనపు భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలనే ఉద్దేశంతో క్షేత్రస్థాయి నుంచే ‘సీఎం ప్రజావాణి’ కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించింది. ఇందుకు ఆదివాసీలు అత్యధికంగా ఉన్న ఆదిలాబాద్‌ జిల్లాను పైలట్‌ ప్రాజెక్ట్‌ కింద ఎంపిక చేసింది. కార్యక్రమ అమలుపై అధికారులు, సిబ్బందికి నేటి నుంచి శిక్షణ ఇవ్వనున్నారు.

మండల కేంద్రాల్లో ప్రత్యేక వ్యవస్థ

ఈ కార్యక్రమ అమలు కోసం మండల కేంద్రాల్లో ఇన్ఫర్మేషన్‌ ఫెసిలిటేషన్‌ సెంటర్‌ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక గదిని కేటాయిస్తారు. అందులో కంప్యూటర్‌, ప్రింటర్‌ను సమకూర్చుతారు. ప్రజలు అందించే దరఖాస్తులను స్వీకరించేందుకు ఇద్దరు ఆపరేటర్లు, రోజువారీగా అందే దరఖాస్తులను పర్యవేక్షించేందుకు సూపరింటెండెంట్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ స్థాయి అధికారిని నియమించనున్నారు. ఈ ప్రక్రియను ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. సిబ్బందితో పాటు సీసీలు, పెసా మొబైలైజేషన్‌ కోఆర్డినేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా ఈ కార్యక్రమ అమలుపై జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక రిసోర్సు పర్సన్లు హాజరవుతున్నారు.

ఐదు శాఖలకు తొలి ప్రాధాన్యత

తొలివిడతగా ఐదు కీలకమైన శాఖలకు సంబంధించిన అర్జీలు మాత్రమేఇందులో స్వీకరించనున్నారు. రెవెన్యూ, వ్యవసాయం, విద్యుత్‌, మిషన్‌ భగీరథ, గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రధానంగా ధరణి, తాగునీటి సమస్యలతో పాటు పింఛన్లు వంటి ఆయా శాఖలకు సంబంధించి అన్ని అంశాలతో కూడిన స్టాండర్డ్‌ ఆపరేటింగ్‌ ప్రొసీజర్‌ వ్యవస్థను రూపొందించారు. అర్జీదారులు అందించే సమస్యను గుర్తించి ఆన్‌లైన్‌లో ఆ అంశాన్ని ఎంపిక చేసుకుంటారు. దరఖాస్తుదారుకు వెంటనే రశీదు ఇస్తారు. అలాగే అర్జీ ఏ శాఖకు సంబంధించి, ఏ అధికారి పరిధిలో ఉంటుందో వారికి అదే రోజు ఫార్వర్డ్‌ చేస్తారు. వారి సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందనే దాన్ని తెలిపేలా సెల్‌ఫోన్‌కు మెసేజ్‌ కూడా వచ్చేలా చూస్తారు.

నేటినుంచి ప్రత్యేక శిక్షణ

అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్‌ చేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంపీడీలు, సూపరింటెండెంట్లు, సీనియ ర్‌ అసిస్టెంట్లకు జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే గ్రీవెన్స్‌ రిడ్రెసల్‌ అధికారులైన ఎంపీడీవో, ఎంపీవో, తహసీల్దార్‌, వ్యవసాయాధికారి, ఇంజినీరింగ్‌ శాఖల ఏఈలు వంటి అధికారులకు గురువారం కలెక్టరేట్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. కలెక్టర్‌ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణపై స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ఈ శిక్షణ అనంతరం సంక్రాంతి తర్వాత అర్జీల స్వీకరణ ప్రారంభిస్తామని కార్యక్రమ నోడల్‌ అధికారి, జెడ్పీ సీఈవో జి.జితేందర్‌ రెడ్డి తెలిపారు.

ప్రతి నెలా బహిరంగ విచారణ

సీఎం ప్రజావాణిలో అందించిన అర్జీల ప్రగతిని పరిశీలించేందుకు ప్రతి నెలా బహిరంగ విచారణ చేపడుతారు. ఎంపీడీవోలు, సూపరింటెండెంట్లతో పాటు మండల ప్రత్యేకాధికారి, దరఖాస్తుకు సంబంధించిన శాఖాధికారి, దరఖాస్తుదారులు ఇందులో పాల్గొంటారు. పరిష్కారమైతే పరిష్కారమైందని చెబుతారు. లేకుంటే అర్జీదారులు ఇచ్చిన సమస్య ఏ దశలో ఉంది.. ఎందుకు పెండింగ్‌లో ఉందనే దానిపై దరఖాస్తుదారుకు స్పష్టమైన సమాధానం చెబుతారు. తద్వారా జవాబుదారితనం, పారదర్శకత పెరుగనుంది. అలాగే ప్రజల తిప్పలు సైతం దూరం కానున్నాయి.

‘హెచ్‌ఎంపీవీ’పై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్‌ రాజర్షి షా

కై లాస్‌నగర్‌: హెచ్‌ఎంపీవీ అనే కొత్త వైరస్‌ వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ రాజర్షి షా అన్నారు. వంద రోజుల టీబీ నిర్మూలన ప్రచార కార్యక్రమం నిక్షయ్‌ శివిర్‌లో భాగంగా కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఉద్యోగులకు మంగళవారం టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త వైరస్‌కు సంబంధించి ఇంకా మన రాష్ట్రం, జిల్లాలో ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. అయినా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్‌ రాథోడ్‌, రిమ్స్‌ డైరెక్టర్‌ జై సింగ్‌ రాథోడ్‌, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సుమలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోను పరామర్శించిన కలెక్టర్‌

ఆదిలాబాద్‌టౌన్‌: డీఈవో ప్రణీత సోమవారం రాత్రి గుండెపోటుకు గురయిన విషయం విదితమే. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను కలెక్టర్‌ రాజర్షి షా మంగళవారం పరామర్శించారు. అక్కడే ఉన్న రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌, డీఎంహెచ్‌వో నరేందర్‌ రాథోడ్‌తో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.



టీబీ నిర్ధారణ పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్‌

‘అగ్నివీర్‌’తో ఉజ్వల భవిష్యత్తు

ఆదిలాబాద్‌: అగ్నివీర్‌ (వాయుసేన)లో ఉద్యోగం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్‌ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్‌లో అగ్నివీర్‌ రిక్రూట్‌మెంట్‌పై సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అగ్నివీర్‌లో పోస్టుల భర్తీ నేపథ్యంలో ఇంటర్‌, డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు సువర్ణ అవకాశం అని తెలిపారు. చిన్న వయసులోనే ఉద్యోగం సాధిస్తే, జీవితంలో ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 27వరకు ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు. మార్చి 22న ఆన్‌లైన్‌ ద్వారా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. ఇందులో ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, అగ్ని వీర్‌ రిక్రూట్‌మెంట్‌ అధికారులు, ఎయిర్‌ఫోర్స్‌ అధికారులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజర్షి షా

విధుల్లోకి హమాలీలు..

కైలాస్‌నగర్‌: హమాలీ కూలి రేట్ల పెంపు జీవో విడుదల చేయాలనే డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా సివిల్‌ సప్లయ్‌ హమాలీలు ఏడురోజులుగా చేపట్టిన సమ్మె విరమించారు. సివిల్‌ సప్లయ్‌ హమాలీ కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులతో మంగళవారం అదనపు కలెక్టర్‌ శ్యామలాదేవి, పౌరసరఫరాల సంస్థ డీఎం సుధారాణి జరిపిన చర్చలు సఫలమయ్యాయి. రెండు రోజుల్లో కూలి రేట్ల పెంపు జీవో విడుదలకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున సమ్మె విరమిస్తున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి దేవేందర్‌ తెలిపారు. దీంతోకార్మికులు యథావిధిగా ఎంఎల్‌ఎస్‌ పాయింట్లలో తిరిగి విధుల్లో చేరారు.

మళ్లీ కలప దందా

- నాలుగేళ్లుగా అజ్ఞాతంలో స్మగ్లర్లు
- ఇటీవల అడవుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు
- దాడులతో సవాల్ విసురుతున్న వైనం


ఇచ్చోడ మండలంలోని కేశవపట్నంలో నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)


కలప స్మగ్లర్లు బ్రిడ్జిపై నుంచి తోసేసిన అటవీశాఖ అధికారుల వాహనం (ఫైల్)

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, సిరికొండ కేంద్రాలుగా మళ్లీ కలప దందా షురువైంది. కొన్ని రోజులుగా స్మగ్లర్లు దట్టమైన అటవీప్రాంతంలోని టేకుచెట్లను నరికి రాత్రిపూట స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు. వాటిని సైజులుగా మార్చి ద్విచక్ర వాహనాలపై గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

నాలుగేళ్లుగా అజ్ఞాతంలోకి..

జిల్లాలోని అటవీ ప్రాంతాలన్నీ కొన్నేళ్లుగా స్మగ్లర్ల గొడ్డలివేటుకు మైదానాలుగా మారిపోయాయి. దీంతో 2019–20 సంవత్సరంలో అప్పటి సీఎం చంద్రశేఖర్‌రావు కలప దందాను సీరియస్‌గా తీసుకున్నారు. 'జంగిల్ బచావో...జంగిల్ బడావో' అనే నినాదంతో అడవులను రక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు, అటవీశాఖ సంయుక్తంగా కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపారు. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీయాక్టు కింద కేసు నమోదు చేశారు. దీంతో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్ పడింది. నాలుగేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న స్మగ్లర్లు ఇటీవల మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా దందాను షురూ చేశారు.

దాడులు కొత్తేమీ కాదు..

కలప అక్రమ దందా చేస్తున్న వారంతా నేర ప్రవృత్తి కలిగిన వారే. గతం నుంచీ కూడా వారికి అడ్డువచ్చిన అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేయడం వారికి కొత్తేమీ కాదు. గతంలో అటవీశాఖ సిబ్బందిపై దాడులు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని సోన్, నిర్మల్, నిజామాబాద్, మహారాష్ట్రలోని పాండ్రకొడ, యవత్మాల్ పోలీస్ స్టేషన్లలో వేల కేసులు నమోదయ్యాయి.

ఇటీవల పట్టుబడిన కలప వివరాలు

- డిసెంబర్ 14న సిరికొండ నుంచి ఆదిలాబాద్ వైపు ఆటోలో తరలిస్తున్న రూ.60 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 17న సిరికొండ మండలంలోని బోరింగ్‌గూడలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 24న ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన రూ.30 వేల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.
- డిసెంబర్ 30న ఇచ్చోడ మండలం హరినాయక్ తాండ వద్ద ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.27 వేల విలువైన కలపను పట్టుకున్నారు.
- జనవరి 5న కేశవపట్నంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి రూ.3.50 లక్షల విలువైన కలపను స్వాధీనం చేసుకున్నారు.

అటవీశాఖ అధికారులపై దాడులు కొన్ని...

- 2012లో ఇచ్చోడ మండలంలోని చించోలిలో బ్రిడ్జి వద్ద ఆగిఉన్న అటవీశాఖ వాహనాన్ని కిందకు తోసివేశారు.
- 2014లో బజార్‌హత్నూర్ మండలంలోని డేడ్రా అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు టేకు చెట్లను నరుకుతుండగా సిబ్బందితో కలిసి అడ్డుకునేందుకు వెళ్లిన ఇచ్చోడ అటవీశాఖ అధికారిపై రాళ్లతో దాడి చేయగా ఎఫ్ఆర్వో తలకు తీవ్రగాయాలతో బతికి బయటపడ్డాడు.
- 2016లో ఇచ్చోడ మండలంలోని మాన్కపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న చెక్‌పోస్టును ధ్వంసం చేశారు.
- 2023లో ఇంద్రవెల్లి నుంచి ఐచర్ వాహనంలో కలప తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐచర్ వ్యానుతో అటవీశాఖ సిబ్బందిని ఢీ కొట్టే ప్రయత్నం చేయగా తప్పించుకున్నారు.
- 2024లో సిరికొండలో అక్రమంగా కలప తరలిస్తున్న ఆటోను పట్టుకోగా స్మగ్లర్లు అటవీశాఖ సిబ్బందిపై దాడిచేసి పరారయ్యారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కలప అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. స్మగ్లింగ్ నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. పెట్రోలింగ్ ముమ్మరం చేశాం. అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. –ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఎఫ్‌వో, ఆదిలాబాద్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


తిరుపతి(ఫైల్)

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కె.గోపి తెలిపిన వివరాల ప్రకారం గాంధీనగర్‌కు చెందిన మోరె తిరుపతి (49) సోమవారం మాదాపూర్ గ్రామ సమీపంలోని గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా సబ్‌స్టేషన్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నిర్మల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణే రవి (37) మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన రవి పని నిమిత్తం మంగళవారం ద్విచక్ర వాహనంపై కోడద్ గ్రామానికి వెళ్లి తిరిగివస్తుండగా మార్గమధ్యలో రాంపూర్ సమీపంలో ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి మహిళ..

బజార్‌హత్నూర్(బోథ్): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన మెకెన్ గౌరుబాయి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దేగామ పోచమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆటోలో గిర్నూర్‌కు వస్తుండగా దేగామ సమీపంలో మూలమలుపు వద్ద డ్రైవర్ రాకేష్ వేగంగా నడపడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో లింగంపెల్లి అడెళ్ళ(35) మృతి చెందగా తోషం రాజుబాయి, మైలారపు అరుణ్, ఆయిల ఆశన్నకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురి రిమాండ్

బెజ్జూర్: వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో ముసవీర్ తెలిపారు. మడే ప్రభాకర్, తుమ్మల మహేష్, జక్కం వినోద్ మండలంలోని ఏటిగూడ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చగా వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సొంతింటి కల నెరవేరే వరకూ పోరాటం


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సొంతింటి కల నెరవేరేంత వరకు పోరాడుతామని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. మంగళవారం ఎస్సార్పీ3 గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై ఏళ్లు సంస్థలో పనిచేసిన కార్మికులు కనీసం సొంతింటిని కూడా నిర్మించుకోలేక పోతున్నారన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీసం స్ట్రక్చరల్ సమావేశాల్లో వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గొల్ల బాలాజీ, కోశాధికారి చంద్రశేఖర్, మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి, ఆర్జీ 1 అధ్యక్షుడు రాజమౌళి, బ్రాంచ్ నాయకులు బోడకుంట శంకర్, చీకట్ల సాగర్, శ్రీపతి బానేష్, పెరిక సదానందం, మెల్లం శ్రీధర్, నరహరి, వెంకటరెడ్డి, మాదాసి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రిటైర్డు కార్మిక కుటుంబాలు

బెల్లంపల్లి: సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. కన్నాలబస్తీ, టేకులబస్తీ, ఇతర బస్తీలలో నివాసం ఉంటున్న రిటైర్డు కార్మికులు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ పురోభివృద్ధి కోసం రక్త మాంసాలను ధారపోసిన రిటైర్డు కార్మికులపై సింగరేణి యాజమాన్యం సానుభూతి లేకుండా వ్యవహరిస్తోందన్నారు. చాలీచాలని పింఛన్ డబ్బులతో జీవిత చరమాంకంలో ఎన్నోబాధలను అనుభవిస్తున్నామన్నారు. తమకు కంపెనీ క్వార్టర్ తప్పా మరో ఆధారం లేదన్నారు. ఈ విషయంలో కోల్ బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు అమానుల్లాఖాన్, కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎండీ గౌస్, మాజీ ఎంపీపీ తొంగల మల్లేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పొట్ల సురేశ్, ఆకుల సత్యనారాయణ, రిటైర్డు కార్మికులు పాల్గొన్నారు.

కరంజీలో పులి సంచారం


పులి జాడ కోసం గాలిస్తున్న అధికారులు


అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు
- మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు
- పరిసర గ్రామాల్లో భయాందోళన

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని కరంజి(కే)గ్రామంలో పులి సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. పంట చేలకు వెళ్లిన రైతులు పులి పాదముద్రలు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం అధికారులు ఆ గ్రామానికి చేరుకుని పాదముద్రలను గుర్తించి పులి కదలికలను నిర్ధారించారు. మహారాష్ట్రలోని పాండ్రకవడ డివిజన్ జామిని రేంజ్ నుంచి పెన్‌గంగ దాటి బేల రేంజ్‌లోకి వచ్చిందని, కరంజీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లుగా అనుమానిస్తున్నారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో పోలీసులు, గ్రామస్తులు, అటవీ శాఖ అధికారులు పులి జాడ కోసం అన్వేషించారు. పులిని గుర్తించేందుకు ఒక్కో బృందంలో ఐదుగురు చొప్పున మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాబ్‌సింగ్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. తప్పుడు పుకార్లు నమ్మవద్దని పాదముద్రలు గానీ, పులి కదలికలు కానీ గమనించినట్‌లైతే వెంటనే అటవీ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సూర్యాస్తమయం తర్వాత పంటచేలో ఉండవద్దని, ఒంటరిగా చేలకు వెళ్లవద్దని సూచించారు. పంట పొలాల్లోకి వెళ్లేటప్పుడు చప్పుడు చేసుకుంటూ గుంపులుగా వెళ్లాలన్నారు. జైనథ్ సీఐ సాయినాథ్‌తో పాటు ఏఎస్ఐ ఆత్మారాం, అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు నాగోరావు, రాజేందర్, ఆర్.గులాబ్‌సింగ్, మనోరంజనీ, ప్రవీణ్, సంతోష్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న వాహనం ఇచ్చేశారు..

మందమర్రిరూరల్: నాలుగు రోజుల క్రితం సింగరేణి స్క్రాప్ చోరీ చేసి సెక్యూరిటీ సిబ్బంది వెంబడించడంతో దొంగలు స్కూటీని వదిలి వెళ్లారు. స్కూటీని, స్క్రాప్‌ను స్వా ధీనం చేసుకుని ఏరియాలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయానికి తరలించారు. ఏం జరిగిందో తెలియదు కానీ మూడు రోజుల తర్వాత స్కూ టీని సంబంధిత వ్యక్తికి ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయమై ఏఎస్‌వోను వివరణ కోరగా చోరీకి వచ్చిన వ్యక్తి మరొకరి స్కూటీని తెచ్చాడని, స్కూటీకి సంబంధించిన వ్యక్తి కార్యాలయానికి వచ్చి కోరగా ఉన్నతాధికారులకు విషయం చెప్పి స్కూటీని ఇచ్చేశామన్నారు.

కలప పట్టివేత


గుండాలలో పట్టుకున్న కలప

ఇచ్చోడ: మండలంలోని గుండాలలో మంగళవారం దాచి ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గుండాలలో తనిఖీలు నిర్వహించగా రంజా న్ అనే వ్యక్తి ఇంట్లో దాచి ఉంచిన కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ రూ.6,400 ఉంటుందన్నారు.

జన్నారం: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కలపను మాటు వేసి పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. నాలుగు రోజులుగా కలప తరలించడానికి యత్నిస్తున్నారనే సమాచారం మేరకు రేంజ్ అధికారి సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సోమవారం రాత్రి ముచ్చినేని రాజు టేకు దుంగను బైక్‌కు కట్టుకుని వస్తుండగా పట్టుకున్నారు. బైక్‌తో పాటు కలప దుంగను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు లాకవత్ ఉపేందర్, లాకవత్ రాజు, గవ్వల మురళి, రాజుపై కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 29,134 ఉంటుందన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

భైంసాటౌన్: జాతీయ విద్యావిధానంపై ఢిల్లీలో జరిగే శిక్షణకు భైంసా పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ ఎంపికయ్యారు. లోకేశ్వరం మండలం మన్మద్ జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న నవీన్‌కుమార్ ఈనెల 8 నుంచి 28 వరకు జరిగే శిక్షణకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి పదిమందిని ఎంపిక చేయగా జిల్లా నుంచి నవీన్‌కుమార్ ఉన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా


సమ్మయ్యను అభినందిస్తున్న ఏసీపీలు

బెల్లంపల్లి: హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన తెలంగాణ స్టేట్ 11వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లికి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్య సత్తా చాటాడు. 50 సంవత్సరాల విభాగంలో జరిగిన హ్యామర్‌త్రో పోటీల్లో ప్రథమ బహుమతి, డిస్కస్‌త్రో పోటీల్లో తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. మంగళవారం రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అడ్మిన్ ఏసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందరరావు, కమిషనరేట్ ఎంటీవో సంపత్‌కుమార్ అభినందించి రివార్డు అందజేశారు.

ఆదివాసీ గ్రామాల్లో కులదేవత ఉత్సవాలు


జంగుబాయి ఆలయానికి వెళ్తున్న గిరిజనులు


కానుకలు వేస్తున్న కొలాం ఆదివాసీలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెలవంకకు మొక్కిన కొలాం ఆదివాసీలు వారం రోజుల పాటు తమ వంశీయులు ఉన్న గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెర్సపేన్(పెద్దదేవుడు), జంగుబాయి దేవతలున్న గ్రామాలకు వెళ్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం పాటగూడ కొలాం ఆదివాసీలు (కుమ్ర వంశీయులు) జంగుబాయి దేవత ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో పుణ్య(గంగా)స్నానం కోసం కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని జంగుబాయికి మహా పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగుబాయి పూజారి కుమ్ర బాపురావ్, గ్రామ పెద్దలు కొడప లక్ష్మణ్, కుమ్ర రాజు, టేకం లేత, కుమ్ర రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలి'


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న అశోక్

కోటపల్లి(చెన్నూర్): రేసు కుక్కల దాడిలో మృతి చెందిన మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ డిమాండ్ చేశారు. ఇటీవల నక్కలపల్లి అటవీ ప్రాంతంలో ముల్కల్ల వెంకటేశ్‌కు చెందిన 55 మేకలపై రేసు కుక్కలు దాడిచేసి హతమార్చాయి. మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ కుక్కల దాడిలో 55 మేకలు చనిపోగా 22 అటవీ ప్రాంతంలో గల్లంతయ్యాయన్నారు. రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేలా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కృషి చేయాలని కోరారు.

పత్తి బేళ్లు మీదపడి కూలీ మృతి

బోథ్: పత్తి బేళ్లు మీదపడి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షిద్ నగర్ కాలనీకి చెందిన గాయక్వాడ్ సంతారామ్ (54) బోథ్ మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్‌లో రెండు నెలలుగా కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జిన్నింగ్ ఆవరణలో దీపక్ అనే మరో కూలీతో కలిసి పత్తి బేళ్లను ఒక క్రమంలో పెడుతుండగా ప్రమాదవశాత్తు 1.7 క్వింటాళ్ల బరువున్న పత్తి బేళ్లు సంతారామ్ మీదపడ్డాయి. ముఖం, ఛాతిపై తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య గాయక్వాడ్ నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణుల వేటగాళ్ల పట్టివేత


వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడే ముఠాను మంగళవారం పట్టుకున్నట్లు లక్సెట్టిపేట అటవీరేంజ్ అధికారి అత్తె సుభాశ్ తెలిపారు. టీకానపల్లికి చెందిన జాడి రాజలింగు, ఇరగడ్డ సాగర్, బుద్ధిపల్లికి చెందిన జాడి వినోద్, దుర్గం ప్రశాంత్, దుర్గం రాములు జాడి రాజలింగుకు చెందిన పత్తి చేనులో ఉన్న విద్యుత్ లైన్ ద్వారా సమీప అటవీ ప్రాంతంలో సంచరించే వన్యప్రాణులను వేటాడేందుకు రెండు కిలోమీటర్ల వరకు బైండింగ్ వైర్ వేశారు. ఈ నెల 3న అటవీ అధికారులు గమనించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని లక్సెట్టిపేట అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. విచారణలో నేరం అంగీకరించడంతో వైల్డ్‌లైఫ్ సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కానీ మూడు రోజుల క్రితం వేటగాళ్లను అదుపులోకి తీసుకున్న అధికారులు బేరసారాలు సాగిస్తున్నారని ముమ్మర ప్రచారం జరగడంతో అప్రమత్తమై ఎట్టకేలకూ అరెస్టును అధికారికంగా ప్రకటించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చైనా మాంజా వినియోగిస్తే చర్యలు తప్పవు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్ నాయక్

కాసిపేట(బెల్లంపల్లి): చైనామాంజాతో గాలిపటాలు ఎగురవేస్తే చర్యలు తప్పవని అటవీశాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ అన్నారు. మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్, ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేయడం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇది ప్లాస్టిక్ పదార్థంతో చేయడంతో గట్టిగా పదునుగా ఉంటుందని, ఆ దారానికి గాజుపొడి పూయడంతో పిల్లలు, మనుషులు, పక్షులు, అటవీ జంతువులను కోసుకుపోవడం వలన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర పర్యావరణ చట్టం 2016 ఉత్తర్వుల ప్రకారం చైనా మాంజాను నిషేధించినట్లు తెలిపారు. మాంజాను రవాణా చేసినా నిల్వ ఉంచినా గాలిపటాలు ఎగురవేసినా మూడు నుంచి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నాగమల్లయ్య, పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, తిరుపతి, చెంద్రశేఖర్‌రెడ్డి, మాధవిలత, కృష్ణగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ గద్దె రాజు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి తెలంగాణ స్థాయి(సౌత్‌జోన్)అండర్–13 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయి. ఖేలో ఇండియా పోటీలలో భాగంగా ఐదు రోజులపాటు లీగ్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొత్తం ఏడు జిల్లాల జట్లు పాల్గొననున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పోటీల నిర్వహణకు సింగరేణి యాజమాన్యంతో పాటు క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఏఈ అచ్యుత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు పరిశీలించారు.

పురుగుల మందుతాగి ఒకరు బలవన్మరణం

బెజ్జూర్: పురుగుల మందు తాగి ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని అందుగులగూడకు చెందిన కోరేత ప్రకాశ్ (32)కు గబ్బాయి గ్రామానికి చెందిన లలితతో పదమూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి గబ్బాయిలోనే నివాసం ఉంటున్నాడు. దంపతులకు తొమ్మిదేళ్ల కూతురు ఉంది. భార్య ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంటివద్ద పెరట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా 108లో బెజ్జూర్ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కాగా ప్రకాశ్ మృతికి అతని భార్య కారణమని కుటుంబ సభ్యులు ఇచ్చి ఫిర్యాదు మేరకు లలితపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ల్యాండ్రీ షాపు దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో గల దస్నాపూర్ కాలనీలో ల్యాండ్రీ షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు సాంటెన్న తెలిపిన వివరాల మేరకు సోమవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10.30 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లగా అప్పటికే అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారన్నారు. ప్రమాదంలో షాపులో ఉన్న ఫ్యాన్, టేబుల్, కుర్చీలు, బట్టలు దగ్ధమయ్యాయని, వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. బాధితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని సామాజిక వేత్త ముడుపు మౌనిష్ రెడ్డి కోరారు.